



నల్ల సూర్యుల ప్రాణాలు గాల్లో దీపాలు



గనుల్లో ప్రమాదానికి గురైన కార్మికులు

- కేటీకే 5 ఇంక్లైన్ భూగర్భ గనిలో మంటలు
- గ్లాటర్ల మార్పుకోసం వెల్డింగ్ చేసిన చోట అంటుకున్న నిప్పు
- విష వాయువులతో నలుగురు కార్మికులకు అస్వస్థత
- ఆస్పత్రికి తరలింపు, సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

సింగరేణి కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయి.. ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. వరుస సంఘటనలు జరుగుతున్నా యాజమాన్యం అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం. బొగ్గు గనుల్లో తరచూ జరిగే ప్రమాదాలు, కార్మికుల ప్రాణాలు కోల్పోవడమే ఇందుకు నిదర్శనం. గనుల్లో రక్షణ చర్యలు తూతూ మంత్రంగానే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాజాగా భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని 5 ఇంక్లైన్ గని రెండో లెవల్ మ్యాన్‌రైడింగ్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం మొదటి షిఫ్టుకు కార్మికులు హాజరై విధులు నిర్వర్తించి ముగింపు సమయాన బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో అప్పటికే గనిలోపల గ్లాటర్లు మార్చి.. పాత వాటిని కట్ చేసి వాటిని తీసేసి స్లాబ్ చేసి క్లోస్ చేసే పని వెల్డింగ్ ద్వారా చేపట్టారు. దీంతో స్లాబ్‌పైన గ్యాస్ కటింగ్ చేయడం మూలంగా ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు చెలరేగి బొగ్గు పెల్లలకు అంటుకొని మంటలు వ్యాపించాయి. ఆ మంటలతో విషవాయువులు వెలువడగా గనిలో ఉన్న నలుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురైన జనరల్ అసిస్టెంట్ దాసరి అన్వేష్, ఫిట్టర్ రాయారపు రంజిత్, సపోర్టుమెన్ ట్రెయినీ ఓ. రఘులు ముందుగా అస్వస్థతకు గురై బయటకు వచ్చి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వెంటనే అధికారులు గమనించి వారిని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరో వ్యక్తి జనరల్ అసిస్టెంట్ (పంప్ ఆపరేటర్)గా విధులు నిర్వర్తిస్తున్న సొన్నాయిల క్రాంతికుమార్ గనిలోనే ఇరుక్కుపోగా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో సుమారు అర గంట పాటు అధికారులు రక్షణ చర్యలు చేపట్టి అతడిని బయటకు తీసుకరాగా అస్వస్థతో ఉన్న ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. కాగా, నలుగురు కార్మికులకు ప్రాణాపాయం తప్పింది.

రక్షణ చర్యల్లో అధికారులు..

గనిలో చోటు చేసుకున్న ప్రమాదంపై సింగరేణి, ఫైర్, రెస్క్యూ, సెక్యూరిటీ, సెఫ్టీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఓటూ జీఎం కవీంద్ర ఘటనా స్థలికి చేరకొని ఘటనపై ఆరా తీశారు. అలాగే, సింగరేణి సీనియర్ సెక్యూరిటీ (మిగతా 8వ పేజీలో)





కేటీకే 5 ఇంక్లైన్ గని ఆవరణలో రక్షణ చర్యల్లో రెస్క్యూ టీమ్, ప్రమాద వివరాలు తెలుసుకునేందుకు గనిలోకి దిగుతున్న సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి



మేడారంలో ప్రారంభానికి నోచుకోని పోలీస్‌స్టేషన్

కొత్త ఠాణాలు ఎప్పుడో..?!

- ఉమ్మడి జిల్లాలో గతంలోనే 3 పోలీస్‌స్టేషన్లు, 6 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- నడికూడ, మేడారం, అలుబాకలో ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కేయూ, జనగామ, నర్సంపేట, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లకు ప్రతిపాదనలు
- పోలీస్‌కమిషనరేట్ పరిధిలో రెండు పోలీస్‌స్టేషన్లు అవసరంగా గుర్తింపు
- అప్‌గ్రేడేషన్‌కు నోచుకోని పోలీస్‌స్టేషన్లు.. సిబ్బంది కొరతతో అవస్థలు..

ఏళ్ల తరబడి కాగితాల్లోనే మూలుగుతున్న ప్రతిపాదనలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కొత్త ఠాణాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు కాగితాలకే పరిమితమవుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో కొత్తగా ఠాణాల ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. కొత్త జిల్లాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. వీటితో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా మరో రెండు పోలీస్‌స్టేషన్‌ల కోసం చేసిన ప్రతిపాదనల ఫైలు కదలటం లేదు. దీనికి తోడు ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడేషన్‌కు నోచుకోవటం లేదు. దీంతో చాలా పోలీస్‌స్టేషన్లలో అరకొర సిబ్బందితో స్టేషన్లను నెట్టుకురావాల్సి వస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కాగితాల్లోనే కొత్త ఠాణాలు

కొత్త ఠాణాల ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో 45 పోలీస్‌స్టేషన్లు ఉండగా, భూపాలపల్లిలో 13 పీఎస్‌లు, ములుగు జిల్లాలో 10, మహబూబాబాద్ జిల్లాలో 18 పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. మొత్తం గా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 86 పోలీస్టేషన్లు ఉండగా, పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న కాలనీలతో కొత్తగా (మిగతా 7లో..)



యాత్రాదానం బస్సును బహుమతిగా ఇవ్వండి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- టూర్ ప్యాకేజీల కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళిక

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 118 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల టూర్ ప్యాకేజీల కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించి 'యాత్రాదానం' బస్సును ప్రజలకు బహుమతిగా ఇవ్వాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం ఆర్టీసీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 27 నుంచి ఆర్టీసీ సంస్థ టూర్ ప్యాకేజీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అరుణాచలం, భద్రాచలం, నాగార్జునసాగర్, విశాఖపట్నం, విజయవాడ, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, వరంగల్, కాళేశ్వరం, అనంతగిరి, కొమురవెల్లి, ద్వారక, తిరుమల, అన్నవరం, వేములవాడ, మొదలైన తీర్థయాత్రలకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లడానికి అనువుగా ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కాగా ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపో మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, జీఆర్‌రెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్, ఆర్టీసీ అధికారులు

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అందరికీ విద్య, సౌకర్యాలు అందించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, విద్య, మహిళా సంక్షేమ, గిరిజన, డీఆర్డీఓ, టీజీ డబ్ల్యూఐడీసీ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించిన కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతులు, మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా నివేదికలు సమర్పించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన అవసరమైన ప్రతిపాదనలు సమయానికి సమర్పిస్తే నిధులు మంజూరు సులభమవుతుందని తెలిపారు. అందరికీ విద్య అందాలంటే పాఠశాలల్లో మంచి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులకు అనువైన వాతావరణం కల్పించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు ప్రాధాన్యత ఇచ్చి మరమ్మతులు చేపట్టాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో నూరుశాతం విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డీఈవో రాజేందర్, సంక్షేమశాఖ అధికారి మల్లీశ్వరి, డీఆర్డీవో బాలకృష్ణ, డీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాటారం, మల్హర్‌రావు మండలాల్లో వరంగల్ ఆర్ఏఆర్ఎస్ (ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం)శాస్త్రవేత్తలు గురువారం పర్యటించారు. కాటారం, ఎడ్లపల్లి గ్రామాల పరిధిలో వరి, పత్తి పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఆయా పంటల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, తెగుళ్లు, పురుగుల ఉధృతిని పరిశీలించారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసు కోవాల్సిన చర్యలను, వర్షాలతో పత్తిపంటకు జరుగుతున్న నష్టం నివారణకు చేప ట్టాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న, విత్తనోత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న, ఎంటమాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఓం ప్రకాష్, శాస్త్రవేత్త డాక్టర్ రమ్య, ఏఈవోలు రాజన్న, ఆస్మా, మౌనిక, రైతులు తదితరులు ఉన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో నిర్మిస్తున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు వేగవంతం చేసి ప్రజలకు వీలైనంత తొందరలో అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం విడుదల చేసిన నిధులు సరిపోవడం లేదని, ఇంకా నిధులు కావాలని అడుగగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే మంజూరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఏఈ మానస తదితరులు ఉన్నారు.

హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఇతర అధికారులు ➤



నల్లబారిన తెల్ల బంగారం..

- అతివృష్టి పరిస్థితులతో పత్తి రైతులకు ఆ 'పత్తి'
- పత్తిని ఎదనీయకుండా చేసిన కలుపు, చీడపీడలు
- ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలంటున్న రైతాంగం



గడ్డి, తేమతో ఎదగని పత్తిపంట

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మొదట్లో ఎండలు.. ఇప్పుడు వానలు పత్తి రైతులను చిత్తు చేస్తున్నాయి. సీజన్ మొదట్లో వర్షాభావ పరిస్థితుల వల్ల మొక్కలు ఎండిపోగా.. ఉన్న కొద్దో గొప్పో మొక్కలను కాపాడిన రైతులకు ఇప్పుడు వర్షాల రూపంలో ఇబ్బందులు తప్పడం లేదు. వాణిజ్య పంటగా పేరొందిన పత్తి తెలంగాణలో సాగు విస్తీర్ణంలో దేశంలో 3వ స్థానంలో ఉండగా ఈ ఏడాది జి ల్లాలో అధిక విస్తీర్ణంలోసాగయ్యింది. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పత్తి పంట సాగవగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని కాటారం, మహాముత్తారం, మల్హర్, మహదేవపూర్, పలిమెల మండలాల్లోనే 45వేలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. పత్తిలో అధిక దిగుబడులు సాధించి మంచి ఆదాయాన్ని పొం దాలంటే సరైన యాజమాన్య పద్ధతులు, సాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలు చేపడితే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని గత రికార్డు లు చెప్తున్నాయి.

నల్లరేగడి నేలల్లో పత్తికి ఇబ్బందులు


పత్తి పంట సాధారణ పరిస్థితుల్లోనైతే నల్లరేగడి నేలల్లోనే అధిక దిగుబడులు ఇస్తుంది. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతుల పాలిట పత్తి తెల్లబంగారమే అవుతుందన డంలో అతిశయోక్తి లేదు. కానీ నల్లరేగడి నేలల్లో తేమశాతం ఎక్కువగా ఉంటే పత్తి పంట ఎదుగుదలలో ప్రభావం చూపుతుంది. భారీ వర్షాలతో నల్లరేగడి నేలలు నీటిని ఎక్కువగా పీల్చుకుని పత్తి పంట ఎదగని పరిస్థితి తలెత్తింది. కలుపు తీయడం కష్టమవుతోంది. వేలాది ఎకరాల్లో పత్తి ఎడతెగని వర్షాలతో ఓ వైపు ఎర్రబారి పోవడం, మరోవైపు కలుపు సమస్య తీవ్రమై దిగుబడులు సరిగా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. మంచి యాజమాన్య పద్ధతులు పాటించి, వాతావరణం అనుకూలిస్తే పత్తి చౌక నేలల్లో 7-9క్వింటాళ్లు, నల్లరేగడి నేలల్లో 10-15క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. ఎడతెగని వర్షాలతో పత్తి ఎర్రబారడం, కాయలు నల్లబడడం, పంట ఎదుగుదల నిలిచి పోవడంతో సరిగా దిగుబడులు రాక నష్టపోయే పరిస్థితి ఉందని, దెబ్బతిన్న పత్తి పంటపై సర్వే చేసి తమలను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పత్తి చేలల్లో వర్షం నీరు నిలవకుండా చేయాలి...

- కంటె శ్రీపాల్, ఏడీఏ, మహదేవపూర్.



పత్తి చేలల్లో వర్షపు నీరు నిలవకుండా రైతులు చర్యలు చేపట్టాలి. చేలల్లో ఓవైపు నీరంతా వెళ్లిపోయేలా చూడాలి. చేలల్లో రోజుల తరబడి నీరు నిలిస్తే మొక్కలు పోషకాలను గ్రహించే పరిస్థితి లేక ఆకులు ఎర్రబారి పోతాయి. దీని నివారణకు రైతులు మల్టీ-కే ద్రావణాన్ని పత్తిపై పిచికారీ చేసుకోవాలి.



నల్లబడి, పాడైన పత్తి కాయలను చూపుతున్న రైతు సమ్మక్క

నల్లరేగడి చేనులో ఎర్రబారుతున్న పత్తి



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రేగొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రేగొండ మండలంలోని కనిపర్తి గ్రామాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి త్వరగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. రాబోయే బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. బతుకమ్మ వేడుకలు సందర్భంలో వీధి దీపాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉల్లాస్ జిల్లా కో ఆర్డినేటర్‌కు ఘన సన్మానం



కృష్ణబాబు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వెంకటాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యం ఆవరణలో టీఎస్ ఏటీఎఫ్, ఏటీఏ ఆదివాసీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉల్లా స్ జిల్లా కోఆర్డినేటర్‌గా నూత నంగా నియమితులైన పీర్ల కృష్ణబాబు దంపతులను గురువా రం పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏటీఎఫ్ రాష్ట్ర నాయ కుడు కోరం సంతోష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏటీఎఫ్, ఏటీఏ ఉపాధ్యాయ సంఘాల నాయకులు బొగ్గుల లక్ష్మయ్య, బోదెబోయిన పరమేశ్వర్‌రావు, చిరంజీవి, జజ్జరి నాగేశ్వర్‌రావు, ఇందిరాదే వి, నాగమణి, శిల్ప, భుజంగరావు, రాంబాబు, రామ్మూర్తి, శాంతకుమార్, నాగరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మధు(ఫైల్)

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాంపల్లికి చెందిన గొర్రెల పెంపకందారైన ఎల్లవేన మధు (26)అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో కిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామస్థులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుకు సొంతంగా 100కి పైగా గొర్రె లున్నాయి. ఇతర పెంపకందారులతో కలిసి పలు ప్రాంతాల్లో గొర్రెల ను మేపుతుంటాడు. ఈ నేపథ్యంలోనే ములుగు జిల్లా వెంక టాపూర్ మండలానికి గత నెలలో గొర్రెలను మేత కోసం మన్నెం తరలించారు. ఈ క్రమం లో గత నెల 20న బైక్‌పై చెల్పూరుకు చెందిన యువకుడితో కలిసి మధు ఇంటికి వస్తుండగా పాలంపేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన డంతో మధు తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసిన కుటుంబసభ్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైదరాబాద్‌కు తరలించారు. 27రోజులుగా సుమారు రూ.10లక్షలకు పైగా ఖర్చు చేసి చికిత్స అందించినా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు.



URGENT WANTED

★ Securety Guards 8 Hrs. 14000/- Salary. 3 Female Members Computer Operators Office Duty 10,000/- Salary. Cont : 8500395667

AJW-243401

WANTED

★ పద్మావతి ఫర్నిచర్ షాప్ శివనగర్, వరంగల్‌లో పనిచేయుటకు Female B.Com Computer, Male MBA, MBA Computer Ph: 9010415400, 9177601779

AJM-13971

WANTED

★ సుబేదారిలో డాయ్ షాపులో పనిచేయుటకు స్త్రీ/పురుషులు వర్కర్ కావలెను. ఉదయం 6గం॥ నుండి సాయంత్రం 7:30 వరకు జీతం : 9,000-10,000 వయస్సు : 20-40సం॥. సెల్ : 9700871260

AJW-243509

WANTED

★ హాస్పిటల్ పనిచేయుటకు PRO's ఫార్మసిస్ట్, రిసెప్షనిస్ట్ మరియు ఆయాలు (వసతి కల్పించబడును) బేబీస్ లైఫ్ హాస్పిటల్ కాకాజీ కాలని హన్మకొండ. సెల్.నెం :9032753764

AJW-243430

కావలెను

★ మా ఆఫీస్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అనుభవం గల ఆఫీస్ అసిస్టెంట్ మరియు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలయును. జీతం : 10,000/- to 15,000/- సం॥ప్ర॥ 8978459111

AJW-552

CHANGE OF NAME

★ I Submit My Son Name Is GARIGE SAI SUMEETH SRI, S/o. Garige Anil,. R/o. H.No: 27-14-144, Hasanparthy (Vill&Mdl), Hanamakonda (Dist). As per Study Certificate But as per Aadhaar Vide 298436960896 on My Son Name is **GARIGE CHOTU (Old Name)** My Son Correct Name Is **GARIGE SAI SUMMEETH (New Name)** S/o. Garige ANIL as Per Study Certificate for all official

AJW-243188

HOUSE FOR SALE

★ 32 లక్షలకే East Facing పక్కా రిజిస్ట్రేషన్ గల 113 Sq.Yds పాత గూన ఇల్లు-వరంగల్ మట్టెవాడలోని రేకులపల్లి వాడలో 10ft. ఫ్యూచర్‌లో కట్టుకోవడానికి G+1 Municipal Construciton Permission కూడా ఉన్నది. బ్యాంకు లోన్‌కూడా వస్తుంది. సం॥ప్ర॥ 8331888842

AJW-243508

JOB/SERVICES

★ Any Degree Software with Training and Placement at Hyderabad Contact : 8096520976

AJW-6651

LEASE / SALE

★ హన్మకొండ మెయిన్ సెంటర్లో మంచి రన్నింగ్ కండిషన్‌లో ఉన్న హోటల్ లీజ్‌కి లేదా సేల్ చేయబడును. సెల్ : 7569268606

AJW-243429

CHANGE OF NAME

★ I Submit My Son Name Is GARIGE SAI SWAROOP SRI, S/o. Garige Anil,. R/o. H.No: 27-14-144, Hasanparthy (Vill&Mdl), Hanamakonda (Dist). As per Study Certificate But as per Aadhaar Vide 588668386927 on My Son Name is **GARIGE CHINNU (Old Name)** My Son Correct Name Is **GARIGE SAI SWAROOP (New Name)** S/o. Garige ANIL as Per Study Certificate for all official

AJW-243189

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677

వరంగల్
9949638376
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9949638376

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

జీవో నంబర్ 64ను వెంటనే రద్దు చేయాలి

ఐటీడీఏ ఎదుట కళ్లకు రిబ్బన్లు కట్టుకుని దినసరి కార్మికుల నిరసన

ఏటూరునాగారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల దినసరి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వర్కర్లు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈనెల 17న ములుగులో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వర్కర్ గుగులోతు శ్రీను ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్, ఉపాధ్యక్షుడు మడే రవిలు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2014లో తీసుకొచ్చిన జీవో 212 ప్రకారం ఐదేళ్లు పూర్తయిన వర్కర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

అయితే, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 64ను అమలు చేస్తామనడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. ఈ జీవో ప్రకారం నెల జీతంలో సగం తగ్గించే అవకాశం ఉందని, దీని వల్ల వర్కర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండలో 20 మంది వర్కర్లకు టైమ్ స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నారని, ఆదేవిధంగా ఇక్కడ కూడా అమలు చేయాలని లేనిపక్షంలో పాత పద్ధతి ప్రకారం కలెక్టర్ గెజిట్ వేతనాలను అమలు చేయాలని కోరారు. నిధులు ఉన్నప్పటికీ ఆరు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పైరవీలు, లంచాలతో కొత్త పేర్లను నమోదు చేసి అసలైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వర్కర్లకు ప్రమాద బీమా కింద రూ. 10 లక్షలు ఇవ్వాలని, జీతంతో కూడిన వారాంతపు సెలవులు, రెండు జతల యూనిఫామ్, గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దినసరి కార్మికుల నాయకులు ఎం. నాగలక్ష్మి, జి. విజయలక్ష్మి, కమల, జయలక్ష్మి, నాగమణి, సరోజన, సారబాబుతో పాటు సుమారు 140 మంది వర్కర్లు పాల్గొన్నారు.



కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన చేస్తున్న దినసరి కార్మికులు

లంబాడీల సంప్రదాయాలకు ప్రతీక తీజ్

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ పండుగ నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డులో గల పెద్దకుంటపల్లిలో నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెళ్లికాని యువతులతో సాంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. వారితో పాటు ఎమ్మెల్యే స్టెప్పులు వేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పండుగ ఆచారాలు, విలువలకు, భావితరాల సంప్రదాయాలకు గుర్తుగా ఉంటుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం లంబాడీ కులస్తుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు. తీజ్ పండుగలు సామాజిక ఐక్యతను, సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



గోధుమగడ్డి పాత్రను మోసుకెళ్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

20న ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడా ఎంపికలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడా ఎంపికలు ఈనెల 20న జనగామలో నిర్వహిస్తున్నట్లు క్రీడల కన్వీనర్ అజ్మీరా కిషన్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో అండర్-19 బాలుర విభాగంలో క్రీడా ఎంపికలు జనగామలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల చివరి వారంలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గలవారు శనివారం ఉదయం 10 గంటల లోపు జనగామలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 83749 10159, 98490 59284 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మళ్లీ పెరిగిన గోదావరి

మహదేవపూర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గురువారం గోదావరి వరద ఒక్కసారిగా పెరిగింది. మహారాష్ట్రలో వర్షాలు కురవడం, ప్రాణహిత ద్వారా వరద రావడంతో త్రివేణి సంగమం వద్ద గోదావరి గురువారం 10.75 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పశువుల కాపరులు, రైతులు గోదావరి వరద వల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

కొనసాగుతున్న వరద ప్రవాహం

● బ్యారేజీలోకి 7.09లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 7.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.60మీటర్లు ఎత్తులో ప్రవహిస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



చిలుపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు, మండలంలోని పల్లగుట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బోనాల చిత్ర ఎంపికైందని హెచ్ఎం యల్లంభట్ల విజయ్‌కుమార్, పీఈటీ దేవ్‌సింగ్ గురువారం తెలిపారు. గత 13న స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచిన చిత్ర రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

సింగరేణి ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించండి

ఎస్‌బీఐ చైర్మన్‌ను కోరిన సీఎండీ బలరాం

కొత్తగూడెం, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గ్లోబల్ పేరుతో దేశ, విదేశాల్లో చేపట్టే ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ను కోరారు. ముంబయిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో గురువారం సంస్థ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టితో పాటు, డిప్యూటీ ఎండీ సత్యేంద్ర కుమార్ సింగ్, సీజీఎం శైలేష్ ఉన్నితన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ త్వరలోనే దేశ విదేశాల్లో కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించబోతోందని, ఇప్పటికే సింగరేణి సంస్థకు కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు లైసెన్స్ లభించినట్టు సీఎండీ బలరాం వారికి వివరించారు. దేశ విదేశాల్లో కీలక ఖనిజ అన్వేషణ ఉత్పత్తి కోసం ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా అధ్యయనం జరుపుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కీలక ఖనిజ రంగానికి సంబంధించి అందిస్తున్న రాయితీలను వినియోగించుకుంటూ దేశంలో కూడా పెద్ద ఎత్తున కీలక ఖనిజ ఉత్పత్తికి పూనుకోవాలని నిర్ణయించిందని, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు, 5వేల మెగావాట్ల సోలార్, థర్మల్ ప్లాంట్లు, గ్రీన్ హైడ్రోజన్, మిథనాల్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆయన వివరించారు. సింగరేణి సంస్థ దశాబ్దాల కాలంగా ఎస్బీఐ ద్వారానే పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే భవిష్యత్ విస్తరణ ప్రాజెక్టులలోనూ భాగస్వాములు కావాల్సిందిగా, సహకారం అందించాల్సిందిగా కోరగా వారు సానుకూలంగా స్పందించారు.



ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టితో సింగరేణి సీఎండీ బలరాం

4.15 కిలోల గంజాయి పట్టివేత

రఘునాథపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా రఘునాథపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గంజాయి తరలిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కణ్ణయి కుసులియా అనే వ్యక్తిని ఎస్ఐ డి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పట్టుకున్నారు. అతని వద్ద రెండు ప్యాకెట్లలో ఉన్న రూ.2.07 లక్షల విలువైన 4.15 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఒరిస్సా నుంచి రైలులో హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తుండగా, రైల్వే పోలీసులు రైలులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గమనించి వెంటనే రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌లో దిగి పోయాడు. రోడ్డు మార్గం గుండా హైదరాబాద్ వెళ్లేందుకు బస్ స్టేషన్‌కు వెళ్తుండగా పోలీసుల కంటపడ్డాడు. పోలీసులు అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. ఎస్ఐ గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై ఎఫ్ఐ ఆర్ నమోదు చేయగా, సీఐ శ్రీనివాస్‌రెడ్డి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నారు.



గంజాయిని తరలిస్తున్న వ్యక్తి అరెస్టును చూపుతున్న పోలీసులు

విద్యార్థులు సమాజ అభివృద్ధికి దోహదపడాలి

ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సరస్వతి

వెంకటాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని సమాజ అభివృద్ధికి దోహదపడాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సరస్వతి సూచించారు. గురువారం మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల సౌకర్యార్థం రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్డీటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆమె డీఈవో సిద్ధార్థరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సురక్షితమైన మంచినీటిని సేవించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులకు వాటర్‌క్యాన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కో ఆర్డినేటర్ అర్షం రాజు, ప్రధానోపాధ్యాయు రాలు రాధిక, పీఎస్ హెచ్ఎం నర్సింగరావు, ఏరియా టీంలీడర్లు సంజీవ్‌కుమార్, షఫీ, ప్రతాప్, గంగాధర్, డాక్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు బాబూరావు, ఫిరోజ్, అంబేద్కర్, మహేష్, కిషోర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



వాటర్ క్యాన్లతో విద్యార్థులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తాడ్వాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం గురువారం లభ్యం అయింది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై భిక్షాటన చేస్తూ జీవిస్తున్న మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేశారు. మృతదేహానికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు.

పోలీసుల అదుపులో ఐదుగురు

మహదేవపూర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీసుల అదుపులో ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన ఓ ఐదుగురు వ్యక్తులు అడవిలో వణ్యప్రాణుల వేట కోసం వైర్లు అమర్చినట్లు పోలీసులకు సమాచారం అందడంతో గురువారం తెల్లవారుజామున గ్రామానికి వచ్చి ఐదుగురు వ్యక్తులను పోలీసులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇంకా పోలీసులు ధృవీకరించలేదు.

ట్రాక్టర్- కారు ఢీ

● ముగ్గురికి తీవ్ర గాయాలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున పట్టణంలోని బాంబులగడ్డ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల వైపు నుంచి కారు కాళేశ్వరం వైపునకు వెళ్తోంది. ఈక్రమంలో మార్గం మధ్యలో బాంబులగడ్డ వద్ద ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కారులోని ఏడుగురికి స్వల్ప గాయాలు కాగా.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెంనకు చెందిన గవిర శ్రీకాంత్, ములుగుకు చెందిన వీర్ల రాజు, మీదరి సారమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వంద పడకల ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదం గురించి తెలియగానే భూపాలపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది.



ప్రమాదానికి గురైన వాహనం

ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు అహంకారం ఎక్కువైంది.!

రోడ్డు విస్తరణ నిధులు సొంత మండలానికి మళ్లించారు

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు అహంకారం ఎక్కువైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గల తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట గురువారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుంచి 2 ఇంక్లైన్ క్రాస్ వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో టీయూఎఫ్‌డీఎస్‌ఈ నుంచి రూ.6 కోట్లు, సింగరేణి సీఎస్ఆర్ నుంచి రూ.4 కోట్లు మంజూరు చేయించి రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. శాసనసభ ఎన్నికల్లో తాను ఓడిపోయాకా.. స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యే ఆ నిధులను సొంత మండలం గణపురం మళ్లించి ఇక్కడి రోడ్డు పనులను క్యాన్సిల్ చేయించడం జరిగిందని ఆరోపించారు.

ఇప్పటికీ రెండు సంవత్సరాలు అవుతున్నా రోడ్డు విస్తరణ పనులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ రహదారి నిర్మాణం జరిగితే పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల ప్రజలకు సైతం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. 15 రోజుల్లో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించకపోతే ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆందోళన చేస్తున్న విష యం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మాజీ ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన విరమింపజేసి బలవంతంగా వారిని పోలీస్ వాహనాల్లో ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో నాయకులు సెగ్గం సిద్ధు, బండారి రవి, గండ్ర హరీష్‌రెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి, గడ్డం కుమార్‌రెడ్డి, మోతే రాజు, రత్నం అవినాష్‌రెడ్డి, గుమ్మడి ప్రదీప్, పోలవేని మహేందర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మాదాసు తిరుపతమ్మ, నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7440	5300
మక్కలు	2188	1521
కందులు	5782	3022
పెసళ్లు	5350	3022
పల్లికాయ (సూక)	6810	3500
పల్లికాయ (పచ్చిది)	4130	2400
పసుపు (కాడి)	10659	7889
పసుపు (గోల)	10009	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

దామెర చెరువుపై నిర్లక్ష్యమేల?

- 6 నెలలుగా తెరుచుకోని ప్రధాన తూము
- రెండో తూము నుంచి వృథాగా పోతున్న నీరు
- మునుగుతున్న పంటలు.. నష్టపోతున్న రైతులు
- కోతకు గురై చెట్లు, పొదలతో నిండిన కట్ట
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు, పాలకులు



దామెర చెరువు కట్టను కమ్మేసిన చెట్లు

కరీమాబాద్(వరంగల్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీటి పారు దల శాఖ అధికారుల నిర్లక్ష్యం అక్కడి రైతులకు శాపంగా మారింది. ఆర్నెల్లుగా తూము తెరుచుకోకున్నా పట్టించుకున్న నాథులే లేరు. వర్షాలతో కట్ట.. కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతున్నా, చెట్లు పొదలతో చిట్టడవిని తలపిస్తున్నా చర్యలు కానరావడం లేదు. ఇది ఖిలా వరంగల్ మండల పరిధిలోని దామెర చెరువు దుస్థితి.

నగర పరిధిలో వున్న దామెర చెరువు కింద దాదాపు 250 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇక్కడ రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు వరి సాగు చేస్తున్నారు. చెరువు ఒక్కసారి నిండితే రెండు పంటలు గ్యారెంటీ. ఈ చెరువుకు రెండు తూములు వున్నాయి. ఇందులో ఒకటి తూర్పు తూము కాగా, మరొకటి గణేశుడి తూము. ఆయకట్టు సాగుకు తూర్పు తూమే ప్రధానమైనది. యాసంగి సీజన్ నుంచే ఇది తుప్పు పట్టి తెరుచుకోకుండా మొరాయిస్తోంది. వానాకాలం సీజన్‌లో రైతులు నార్లు పోసి వరినాట్లు వేసుకునే దశలోనూ ఇది తెరుచుకోలేదు. దీంతో గణేశుడి తూము నుంచి లీకయ్యే నీటినే రైతులు సాగుకు ఉపయోగించుకుంటున్నారు.

వరుస వర్షాలతో ప్రస్తుతం చెరువు పూర్తిగా నిండింది. ప్రధాన తూముకు మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు అనేకమార్లు విన్నవించారు. అయితే తూమును రిపేరు చేయాలంటే గజ ఈతగాళ్లు అవసరమని, వారు తమకు దొరకడం లేదని, మీరే తెచ్చుకోండని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని అధికారులు చెప్పారని, ఈ విషయంలోనూ శ్రద్ధ పెట్టడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. 'గణేశుడి తూము లీకేజీతో కట్టకు దగ్గరగా వున్న వరి పొలాలు నీట మునుగుతున్నాయి. అలాగే పలువురు రైతుల పొలాలు బుడుగులా మారి సాగుకు పనిరాకుండా పోతున్నాయి... 24 గంటలు నీళ్ల వృథాగా బయటకుపోతున్నాయి..' అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రధాన తూము మరమ్మతులు చేపట్టి, పంట కాల్వలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

పదేళ్ల కిందట రూ.అర కోటి ఖర్చు

ఇప్పటి మంత్రి కొండా సురేఖ 2015 లో ఎమ్మెల్యేగా వున్నప్పుడు 'మిషన్ కాకతీయ'లో భాగంగా చెరువు పునరుద్ధరణ పనుల పేరుతో రూ.53 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అప్పుడు కట్ట మరమ్మతు పనులు చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు చెరువుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని రైతులు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల ఆదరణకు నోచుకోకుండా పోతున్న దామెర చెరువుపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ మళ్లీ దృష్టి సారించాలని, అలాగే చెరువు వద్దకు వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారినందున, మనీదు బండ నుంచి కట్ట వరకు రోడ్డు నిర్మాణానికి నిధులివ్వాలని నీటి వినియోగ దారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు.

పర్యాటక అవకాశాలు

దామెర చెరువును జక్కలొద్ది సమీపంలోని దామెరగుట్టలు, బోడగుట్టకు మధ్య నిర్మించారు. ఇది కాకతీయుల నాటి గొలుసుకట్టు చెరువుగా చెబుతారు. వందలాది ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువు.. అనేక దశాబ్దాలుగా అటు వ్యవసాయదారులు, ఇటు మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తోంది. నగరానికి సమీపంలో ఉండటంతో భవిష్యత్తులో దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 'కుడా' అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. కాకతీయుల కాలం నాటి భారీ వినాయక రాతి విగ్రహం ఈ చెరువుకు ప్రధాన ఆకర్షణ. అలాగే చెరువుకు ఇరుపక్కలా వున్న గుట్టల్లో ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్లు, జైనుల సంస్కృతికి సంబంధించిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ చెరువు నగరానికి చేరువలో ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు ఇక్కడి స్వచ్ఛమైన నీటిలో నిత్యం ఈత కొడుతుంటారు. అటు వ్యవసాయానికి, ఇటు పర్యాటకానికి అనువుగా వున్న దామెర చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని రైతులు, పర్యాటక ప్రేమికులు కోరుతున్నారు.



దామెర చెరువులో పనిచేయని ప్రధాన తూము ఇదే..

ప్రమాదకరంగా చెరువు కట్ట

దామెర చెరువు ప్రధాన తూము పరిస్థితి ఇలా ఉంటే, చెరువు కట్టను ఎవరూ పట్టించుకోవడం లేదు. వరుస వర్షాలతో కట్ట రెండు చివరలా కోతకు గురైందని, దీంతో కట్ట పరిస్థితి ప్రమాదకరంగా మారిందని రైతులు తెలిపారు. ఈ కట్ట తెగితే నగరానికి పెను ప్రమాదమని వారు చెబుతున్నారు. ఇక కట్టపైన చెట్లు, పొదలు విపరీతంగా పెరిగాయి. బయటనుంచి చూస్తే కట్ట ఏ మాత్రం కనిపించడం లేదు. కట్టపైకి వెళ్లడానికి కనీసం దారికూడా లేకుండా పోయింది. కట్ట పటిష్ఠతను, శుభ్రతను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని స్థానిక రైతు, రిటైర్డు జైలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

అరచేతిలో వ్యవసాయం

- వాట్సాప్ చానల్ క్రియేట్ చేసిన వ్యవసాయశాఖ
- రైతులకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు
- నూతన సాంకేతికత, పరికరాల సమాచారం



వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా, త్వరగా రైతులకు చేరవేసేందుకు వ్యవసాయ శాఖ వాట్సాప్ చానెల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుత రోజుల్లో ప్రతీ రైతు వద్ద అండ్రాయిడ్ సెల్‌ఫోన్ ఉంటోంది. సంబంధిత మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే ఆ చానల్‌లో రైతులను చేరుస్తారు. దీని ద్వారా వ్యవసాయంలో కాలానుగణంగా వస్తున్న మార్పులను, మెళకువలను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అధిక ఆదాయాన్ని పొందేందుకు సలహాలు, సూచనలు అందిస్తారు. అంతేగాకుండా పంటల దశను బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు కావాల్సిన సమాచారాన్ని అందజేస్తారు. ఇప్పటికే వరంగల్ జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు ఈ వాట్సాప్ చానెల్‌లో లాగిన్ అయ్యారు. తొలుత ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) 100 మంది రైతుల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ఆదేశించారు.

రైతులకు లభించే సమాచారం

- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు.
- పంటల సంరక్షణ కాలానుగుణ సూచనలు.
- వాతావరణ హెచ్చరికలు, కీటక నియంత్రణ మార్గదర్శకాలు.
- మార్కెట్ ధరలు, శిక్షణా కార్యక్రమాలు.
- రైతు నేస్తం కార్యక్రమాల షెడ్యూల్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా సమావేశాలు.

రైతులకు ఎంతో మేలు

కె. అనురాధ, డీఏవో



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ చానెల్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా దీన్ని రూపొందించారు. పంట పరిస్థితి. దానికి కావాల్సిన ఎరువులు, క్రిమి సంహారక మం దులు ఎలా వాడాలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా అధికారులు, శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇస్తారు.

వాట్సాప్ చానెల్‌తో ఉపయోగం

ఆర్. శ్రీనివాస్, రైతు, మొగిలిచర్ల



పంట దిగుబడి అధికంగా రావాలని విచ్చలవిడిగా ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దిగుబడి తగ్గిపోతోంది. వ్యవసాయశాఖ కొత్తగా తీసుకు వచ్చిన వాట్సాప్ చానెల్‌తో సెల్‌ఫోన్‌లోనే అన్ని విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది. గతంలో మాదిరిగా వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లి సమస్యలను చెప్పుకునే అవస్థలు ఇప్పుడు తప్పింది. దీంతో రైతులకు సమయం కలిసి వస్తుంది. సాగులో ఖర్చు తగ్గి అధిక దిగుబడి, ఆదాయాన్ని పొందేందుకు వీలుపడుతుంది.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, ట్రస్మా బాధ్యులు

ప్రైవేటు టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా..

- ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమైనది..
- విద్యారంగంలో వారి పాత్ర కీలకం
- నాణ్యమైన విద్యను అందించాలి
- ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

కరీమాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ ఉర్సుగుట్ట బైపాస్ రోడ్డులో గల నాని గార్డెన్స్‌లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో ప్రైవేటు ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమైనదని, విద్యారంగాన్ని పటిష్ట పరచడంలో ప్రైవేటు విద్యాసంస్థలు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, భావితరాలకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డితో విద్యారంగంపై చర్చ జరిగిందని, విద్యావంతులతో నిర్వహించిన సమావేశం అనంతరం తెలంగాణలో డిసెంబరు 9న విద్యా రంగంపై నూతన పాలసీని తీసుకురాబోతుందని తెలిపారు. సుమారు 60లక్షల మంది విద్యార్థులు పదవ తరగతిలో అభ్యసిస్తున్నారని అన్నారు. తాను ఉద్యోగంలో ఉన్న సందర్భంలో 35లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటే, 25లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో ఉండేవారని, ప్రస్తుతం అన్ని రకాల గురుకుల పాఠశాలల్లో చూసినట్లైతే 23లక్షలు, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో 17లక్షల మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారని, మిగితా విద్యార్థులంతా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.

దీన్ని బట్టి విద్యారంగానికి ప్రైవేటు విద్యా వ్యవస్థ ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి ఉచిత చికిత్స పాలసీ, హెల్త్ కార్డులను అందించేలా చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి దండపంతుల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఠాణాలు ఎప్పుడో..?!

(5వ పేజీ తరువాయి)

మరిన్ని పోలీస్‌స్టేషన్లు అవసరంగా గుర్తించారు. 2018లోనే ములుగు జిల్లా మేడారంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. మేడారంలో నిత్యం పూజలు జరుగుతుండటంతో పాటు వేలాది మంది భక్తులు రోజు వస్తుండటంతో ఇక్కడ ప్రత్యేక పోలీస్‌స్టేషన్ అవసరంగా గుర్తించి ప్రతిపాదనలు పంపించారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. కానీ, ఇప్పటి వరకు సిబ్బంది కేటాయింపులు చేసి, స్టేషన్ ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం రిజర్వుడు పోలీసులకు షెల్టర్‌గా మారింది.

ఇక ములుగు జిల్లా వెంకటాపురం మండలం అలుబాకలో కూడా పోలీస్‌స్టేషన్ కోసం 2018లోనే ప్రతిపాదనలు చేశారు. చత్తీస్‌గడ్‌కు సరిహద్దులో ఉండటంతో మావోయిస్టుల ఉనికితోపాటు గంజాయి లాంటి అక్రమ దందాను అరికట్టేందుకు అలుబాక స్టేషన్ అవసరంగా గుర్తించి చేసిన ప్రతిపాదనలు ఏడేళ్లుగా కాగితాల్లోనే మూలుగుతున్నాయి. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నడికూడ గ్రామాన్ని 2018 ఆగస్టు 27న నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే కొత్త మండలానికి పోలీస్‌స్టేషన్‌ను ఇవ్వలేదు. ఏడేళ్లుగా పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలోనే కొనసాగుతోంది. దీంతో శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోంది.

తాజాగా వరంగల్ నగరంలో కొత్తగా రెండు పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. సుబేదారి, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధి ఎక్కువగా ఉండటంతో పునర్విభజన చేసి మరో రెండు కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఇవీ కూడా అమలుకు నోచుకోలేదు. దీంతో నగరంలో శాంతిభద్రతల బాధ్యతలు ఖాకీలకు భారంగా మారుతున్నాయి. దొంగతనాలు, గంజాయి స్మగ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు..

కొత్తగా జిల్లాలు ఏర్పడటం.. నగరం భారీగా విస్తరిస్తుండటంతో జనాభా సైతం భారీగా పెరుగుతోంది. దీంతో రహదారులు జామ్ అవుతున్నాయి. వరంగల్ నగరంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు కేయూ పరిధిలో మరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. హసన్‌పర్తి, ఎల్కతుర్తి వరకు నగరంలో కలిసిపోయింది. వడ్డెపల్లి, హనుమకొండ ఆర్టీసీ డిపో ఏరియా మొత్తం కూడా కాజీపేట ట్రాఫిక్ పరిధిలో ఉండటం పోలీసులపై భారం పడుతోంది. కాజీపేట నుంచి మడికొండ, పెద్దపెండ్యాల నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు నగరం విస్తరిస్తుంది. ఈ క్రమంలో కాజీపేట ట్రాఫిక్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో కేయూ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఏడేళ్ల కిందట చేసిన ప్రతిపాదనలకు మోక్షం లభించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అలాగే కొత్తగా మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలో కూడా మరో ట్రాఫిక్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పార్కు విస్తరిస్తుండటంతో ట్రాఫిక్ భారీగా పెరుగుతోంది. ఈ ప్రాంతం లో కూడా మరో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. ఇక కొత్తగా ఏర్పడిన భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని 2019లోనే ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. భూపాలపల్లిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కోసం 2020లోనే స్థల సేకరణ కూడా చేశారు. ఇప్పటివరకు కొత్త జిల్లాల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఊసే లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోం శాఖ మంత్రిగా ఉండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఏర్పాటు చేయాల్సిన నూతన ఠాణాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లపై అధికారి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థాయి పెంచరు.. సిబ్బందిని ఇవ్వరు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సెలవు పెట్టాలన్న పోలీసులకు నిరీక్షణ తప్పటం లేదు. ప్రధానంగా కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినప్పుడు ఎఫ్ గ్రేడ్ కేటగిరీలో సిబ్బంది నియమిస్తారు. ఎఫ్ కేటగిరీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ కలిపి మొత్తం 28మంది ఉండాలి. అయితే ఇటీవల కొత్తగా భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం ఏర్పాటు చేశారు. ఈ మండల పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్సై, మరొకరు సెంకడ్ ఎస్సైతో పాటు ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్ ఆరుగురు కానిస్టేబుల్స్, ఒక మహిళ కానిస్టేబుల్‌ను నియమించారు. మొత్తం 12మంది మాత్రమే గోరికొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. 28మంది సిబ్బంది చేయాల్సిన పనిని 12మందితో చేయిస్తున్నారు. దీంతో సెలవు పెట్టే అవకాశం పోలీసులకు దొరకటం లేదు.

అలాగే ఈ కేటగిరి పోలీస్‌స్టేషన్‌లో 45మంది, డీ కేటగిరి స్టేషన్‌లో 55మంది సిబ్బంది డ్యూటీస్ చేయాల్సి ఉంటుంది. అయితే ఏళ్ల తరబడి ఏ పోలీస్‌స్టేషన్ స్థాయిని కూడా పెంచటం లేదు. ఏ కేటగిరిలో ఉన్న సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించటం లేదు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీ స్‌స్టేషన్లలో పోలీసులకు సెలవులు బంగారమయ్యా యి. పండుగలు, పబ్బాలుకు కూడా సెలవుల కోసం నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి కొత్త ఠాణాలతో పాటు నగరాల్లో కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయటంతో పాటు పోలీస్‌స్టేషన్ల స్థాయిని పెంచి సిబ్బంది నియామకం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

సహకారం.. సంక్షేమం..

- అన్నదాతల సేవలో తరిస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు
- ఏటా రూ.410 కోట్ల వ్యాపార లావాదేవీలు
- రైతులకు రూ.250 కోట్ల రుణాలు
- నేడు ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభ



ముల్కనూర్ సహకార బ్యాంకు వరి విత్తనాలు

భీమదేవరపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు ముందే ముల్కనూర్ సహకార బ్యాంకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మార్గదర్శకంగా నిలుస్తోంది. విత్తనం నాటే దగ్గరి నుంచి ధాన్యం కొనుగోలు చేసే వరకు అన్నదాతకు అండగా ఉంటుంది. పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంతో పాటు ధాన్యాన్ని అమ్మితే వచ్చిన లాభాలను రైతులకే బోనస్ రూపంలో చెల్లించడం ఇక్కడి ఆనవాయితీ. 20 ఏళ్లలో దాదాపుగా రూ.100కోట్ల రాయితీలను అందించింది. ఎన్నో రాష్ట్రస్థాయి అవార్డులతో పాటు జాతీయ ఉత్తమ సహకార సంఘంగా ఎన్నికైంది. దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ముల్కనూర్ బ్యాంకు ఉపాధ్యక్షుడిగా పనిచేసి చనిపోయేంత వరకు బ్యాంకు సభ్యుడిగా కొనసాగారు. దేశంలోని సహకార సంఘాలతో పాటు, పలు ప్రపంచ దేశాల్లోని సహకార సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు 69వ వార్షికోత్సవం ఈ నెల 19న జరుగనుంది.



ముల్కనూర్ సహకార బ్యాంకు

రూ.10 కోట్లతో సంక్షేమ పథకాలు

ముల్కనూర్ సహకార బ్యాంకు రూ.10కోట్లతో 2024-25 సం వత్సరంలో రైతులు, వారి పిల్లలకు సంక్షేమ పథకాలు అందజేసింది. రూ.2కోట్ల బోనస్, రూ.60లక్షలు విద్యార్థుల స్కాలర్‌షిప్ లు, హెల్త్ కోసం రూ.70లక్షలు, కళ్ల ఆపరేషన్ల కోసం రూ.70 లక్షలు తదితర సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది

విత్తనాలు.. బియ్యం..

ముల్కనూర్ సహకార బ్యాంకులో నాణ్యమైన విత్తనాలను రాష్ట్రంతో పాటు చత్తీస్‌గడ్, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు వరి సన్న, దొడ్డు రకాల విత్తనాలను అమ్ముతున్నారు. ముల్కనూర్ బ్యాంకు వరి విత్తనాలంటే వివిధ ప్రాంతాల్లో హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోతున్నాయి. ముల్కనూర్ బ్యాంకు రైతుల కోసం చేపట్టిన వరి సీడ్ విత్తనాలు నాణ్యంగా ఉండడంతో దాదాపుగా యేటా

రూ.410 కోట్ల వార్షిక టర్నోవర్

ముల్కనూర్ సహకార బ్యాంకు ఈ ఏడు రూ.410కోట్ల వార్షిక టర్నోవర్ చేపట్టింది. ఇందులో రూ.250కోట్లు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను రైతులకు అందించింది. రైతులు పండించిన పత్తి, వరి, సీడ్ వరి ధాన్యాన్ని రూ.96కోట్లతో బ్యాంకు కొనుగోలు చేసింది. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు రూ. 30కోట్ల వరకు అమ్మకాలు సాగాయి. రైతులు బ్యాంకులో 7600 మంది సభ్యులుండగా అందులో రైతులు తీసుకున్న రుణాల్లో 99శాతం రికవరీ అయ్యాయి.

ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు రూ.70 నుంచి రూ.80కోట్ల వరకు వరి విత్తనాలు అమ్ముడుపోతున్నాయి. అలాగే ముల్కనూర్ సహకార బ్యాంకు నాణ్యమైన బియ్యం అమ్ముతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు వివిధ దేశాలకు ముల్కనూర్ బియ్యాన్ని అమ్ముతున్నారు. ఆర్ఎన్ఆర్, బీపీటీ, జైశ్రీరాం లాంటి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.



రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల బస్తాలు

వార్షిక సభలో సంక్షేమ పథకాలు ప్రకటిస్తాం..

అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్



ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభలో రైతులకు పలు సంక్షేమ పథకాలను ప్రకటిస్తాం. రైతులకు అండగా ముల్కనూర్ బ్యాంకు నిలుస్తోంది. రైతుల సంక్షేమం కోసం అవసరానికి అనుగుణంగా అనేక కొత్త పథకాలను తీసుకొస్తున్నాం. 20 ఏళ్లలో దాదాపుగా రూ.100కోట్ల రాయితీలను ఆ రైతులకు అందించాం. భవిష్యత్‌లో రైతుకు బ్యాంకు భరోసాగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం. బ్యాంకులో సీనియర్ సభ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నాం. గృహ, విద్య, వైద్యం కోసం రుణాలు అందిస్తున్నాం.

వరంగల్ మీదుగా అమృత్ భారత్

- 25 నుంచి నాన్ ఏసీ వీక్లీ ఎక్స్‌ప్రెస్
- ఈరోడ్ (తమిళనాడు) వైపు మంగళవారం
- జోగ్బని (బిహార్) వైపు గురువారం అర్ధరాత్రి

గిర్మాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు-బిహార్ రాష్ట్రాల మధ్య సాధారణ ప్రజలు వరంగల్ మీదుగా రాకపోకలు సాగించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన ఈరోడ్-జోగ్బని నాన్ ఏసీ అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25వ తేదీ నుంచి వరంగల్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ రైలు 25న ఈరోడ్(తమిళనాడు), 28న జోగ్బని(బిహార్) నుంచి ప్రారంభం అవుతుంది. ఈరోడ్-జోగ్బని అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్(16601) ప్రతి గురువారం ఉదయం 8.10 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి సాయంత్రం 4.40 గంటలకు గూడూరు, సాయంత్రం 6.58 గంటలకు ఒంగోలు, రాత్రి 9.15 గంటలకు విజయవాడ, రాత్రి 11.09 గంటలకు ఖమ్మం, గురువారం అర్ధరాత్రి(శుక్రవారం) 0.53 గంటలకు వరంగల్, శుక్రవారం ఉదయం 2.59 గంటలకు మంచిర్యాల, శనివారం రాత్రి 7 గంటలకు జోగ్బని(బిహార్)కి చేరుకుంటుంది.


అలాగే జోగ్బని-ఈరోడ్ అమృత్ భారత్(16602) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు జోగ్బని (బిహార్)లో బయలుదేరి మంగళవారం ఉదయం 9.04 గంటలకు మంచిర్యాల, 10.58 గంటలకు వరంగల్, మధ్యాహ్నం 12.24 గంటలకు ఖమ్మం, 2.40 గంటలకు విజయవాడ, సాయంత్రం 5.03 గంటలకు ఒంగోలు, రాత్రి 7.50 గంటలకు గూడూరు, బుధవారం ఉదయం 7.20 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. ఈ రైలుకు తెలుగు రాష్ట్రాల్లో గూడూరు, ఒంగోలు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, మంచిర్యాల స్టేషన్‌లలో మాత్రమే హాల్ట్ ఉందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలులో నాన్ ఏసీ స్లీపర్ కోచ్‌లు 8, అన్ రిజర్వుడు జనరల్ కోచ్‌లు 11, దివ్యాంగుల కోచ్‌లు 2, ప్యాంట్రీకార్ 1 ఉంటుందని, ప్రయాణీకులు ఈ రైలును వినియోగించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.



ఈరోడ్-జోగ్బని మధ్య నడిచే అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ములుగు

శుక్రవారం 19 సెప్టెంబరు 2025

8

కలెక్టర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో



వెంకటాపురంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు

- కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

వెంకటాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరపై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివాసీ నవ నిర్మాణసేన ఆధ్వర్యంలో నాయకులు, మొక్క జొన్న రైతులు గురువారం మండలకేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు కొమురంభీం విగ్రహం వద్దనుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జగదాంబ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ డీలర్లు ఆదివాసీ రైతులకు నకిలీ మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి మోసం చేశారని, దీంతో కలెక్టర్ రైతుల పక్షాన ఉండి నష్టపరిహారం అందించారన్నారు. హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో జరిగిన బీఆర్ఎస్‌పార్టీ సమావేశంలో కలెక్టర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకుడు జి.నర్సింహమూర్తిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బీఆర్ఎస్‌నేత కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

- బహిరంగ క్షమాపణలు చెప్పాలి

ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నాయకులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని వెంకటాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. హైదరాబాద్‌లో భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్‌తో సమావేశమై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. కలెక్టర్‌కు క్షమాపణలు చెప్పాలని తెలిపా రు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు బాలసాని వేణు, మన్నెం సునీల్, జల్లిగంపల కళాధర్, కొండపర్తి సీతాదేవి, చిట్టెం సాయి, పిల్లారిశెట్టి మురళి, విక్రాంత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

● వాజేడు : ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకరపై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు చేయడం తగదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.గురువారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్‌వర్మ, సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాదరాజులు పాల్గొని మాట్లాడారు. మండలంలో నకిలీ మొక్కజొన్న విత్తనాలువేసి నష్టపోయిన ఐదు మండలాల్లోని 671మంది రైతులకు కలెక్టర్ దివాకర దగ్గరుండి పరిహారం డబ్బులు అందించారని అన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి, దాట్ల వాసు, వత్సవాయి జగన్నాథరాజు, తల్లడి ఆదినారాయణ, అనుముల సంజీవ, చెన్నం ఎల్లయ్య, రామ్మూర్తి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపురంలో ప్రత్యేక గ్రామ సభ

మంగపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురం జీపీలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ ఇన్‌చార్జి అధికారి చెన్న రంజిత్‌కుమార్ అధ్యక్షతన జరుగగా గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి పలు అంశాలపై చర్చించారు. త్వరలో జరుగబోవు బతు కమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని తగిన ఏర్పాట్లు చేయడా నికి గ్రామంలో అంతర్గత రోడ్లు, సైడ్‌డ్రైనేజీ, శిథిలమైన వాటర్ ట్యాంక్ ను తొలగించి నూతన ట్యాంక్ నిర్మాణం చేయుటకు తగిన నిధులతో అభివృద్ధి చేయడానికి గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సభకు వివిధ పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

ములుగు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ములుగు మునిసిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి వెంటనే స్పందించి మునిసిపల్ కార్మికులతో కలిసి పైప్‌లైన్ లీకేజీని గుర్తించారు. గురువారం పైప్‌లైన్ లీకేజీ పనులను పునరుద్ధరించారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డికి, సిబ్బందికి స్థానిక ప్రేమ్‌నగర్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

భూపాలపల్లి ఎస్సై-2గా సతీష్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఎస్సై-2గా సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ కిరణ్‌ఖరే ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హైదరాబాద్ నార్కోటిక్ బ్యూరోలో విధులు నిర్వర్తించిన ఆయన నెల రోజుల కిందట భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి వీఆర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తుండగా భూపాలపల్లి ఎసై2గా పోస్టింగ్ ఇచ్చారు. కాగా, ఇంతకు ముందు భూపాలపల్లి ఎసై2గా విధులు నిర్వర్తించిన జి. రమేష్ సీసీఎస్ విభాగానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సతీష్‌కు పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న ఇసుక లారీ

వెంకటాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివాలయం మూలమలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని గురువారం ఇసుకలారీ ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో విద్యుత్‌వైర్లు వేలాడగా ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఈవిషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకుని కరెంటు సరఫరాను నిలిపివే శారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటుచేసి విద్యుత్‌లైన్‌ను పునరుద్ధరించారు.

బదిలీపై వెళ్లిన టీచర్‌కు ఆత్మీయ సన్మానం

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రతాపగిరి ప్రాథమిక పాఠశాలలో గత ఎన్నో ఏళ్లుగా పనిచేసి ఇటీవల ప్రమోషన్‌పై ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయుడు హట్కర్ రమేష్ నాయక్‌ను గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు గురువారం ఆత్మీయ సన్మానం చేశారు. పాఠశాలలో ఎంతో ఓపికగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించిన రమేష్‌ను పూలమాలలు, శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి శంకరయ్య, పాఠశాల హెచ్‌ఎం కరుణశ్రీ, మర్రిపల్లి, దంతెలపల్లి హెచ్‌ఎంలు శశిరేఖ, సత్యానారాయణ, గ్రామపెద్దలు తిరుపతి, రమేష్, చంద్రయ్య ఉన్నారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్యశిబిరాలు

వెంకటాపూర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఈ నెల 19వతేదీ నుంచి ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ గురువారం తెలిపారు. 19, 23తేదీల్లో స్త్రీల వైద్య నిపుణులచే మహిళల సంబంధిత సమస్యలపై, 24న పిల్లల వైద్యనిపుణులచే పిల్లలకు, 27న చర్మ సంబంధిత వ్యాధులపై, 29న చెవి, ముక్కు, గొంతు సమస్యలపై నిపుణులచే వైద్యశిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వైద్యశిబిరాలకు మహిళలు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత..

మంగపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఉప కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప కేంద్రంలో చేస్తున్న పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు మంగపేట మండల విద్యుత్ ఏ.ఈ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉప కేంద్రం పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు తమశాఖకు సహకరించి మరమ్మతులకు అవకాశం ఇవ్వాలని ఏ ఈ కృష్ణారావు కోరారు.

చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

మంగపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మంగపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 0- 12 పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిని స్వప్నిత తెలిపారు. స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ (ఎస్ఎస్ఎస్‌పిఏ) ప్రత్యేక క్యాంప్ నిర్వహించగా, ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సునీత హాజరయ్యారు. మంగపేట కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న పిల్లలు, ఇతర బాలికలు 280 మందికి పరీక్షలు చేసి మందులను అందజేశారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు, పోషకాహారం ఇతర విషయాలపై అవగాహన కల్పించారు.

లారీలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి

వెంకటాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుకరీచ్‌ల వద్ద లారీల కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం మండలకేంద్రంలోని కంకలవాగు సమీపంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ ఇసుక లారీలు ఎక్కడపడితే అక్కడ రోడ్డుకిరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీఐ ముత్యం రమేష్ సంఘటన ప్రాంతానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. నాయకులు కుమ్మరి శ్రీను, కట్ల నర్సింహచారి, సమ్మయ్య, మాణిక్యం పాల్గొన్నారు.

స్థానికులనే ఎంఈవోగా నియమించాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

మహాముత్తారం, సెప్టెంబరు 18(ఆంధ్ర జ్యోతి): మహాముత్తారం మండలంలో ఉన్న పీజీ హెచ్‌ఎంలనే ఎంఈవోగా మండలంలో నియమించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి రూబిన్, నేతకా ని మహావీర్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజబా బు గురువారం భూపాలపల్లిలో డీఈవో రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ముగ్గురు పీజీ హెచ్‌ఎంలు ఉండగా భూపాలపల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయున్ని ఎంఈవో నియమించారని, ఈ విషయంలో తగు విచారణ చేసి మండలానికి చెందిన అర్హులైన ఉపాధ్యాయులనే ఎంఈవో నియమించాలని కోరారు.

ఎంపీడీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

మంగపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మంగపేట మండల ఇన్‌చార్జీ ఎంపీడీవోగా పొదిల శ్రీనివాస్ గురువారం ఉదయం నూతన అదనపు బాధ్యతలను స్వీకరించారు. గతంలో నుంచి ఇప్పటి వరకు గత ఆరు నెలలుగా రెగ్యులర్ ఎంపీడీవోగా పనిచేసిన బానోత్ భద్రూ నాయక్‌ను జిల్లా ఉన్నతాధికారులు పదోన్నతి కల్పిస్తూ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ)కు అటాచ్ చేస్తూ బదిలీ చేశారు. ఆయన స్థానంలో మంగపేట ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న పొదిల శ్రీనివాస్‌కు అధనపు బాధ్యతలను అప్పగిస్తూ ఈనెల 16న, జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్రీనివాస్ నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలను గురువారం స్వీకరించారు. నూతన ఎంపీడీవోకు కార్యలయ అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు నాగజ్యోతి పరామర్శ



కమలాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాగజ్యోతి

మంగపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాల్లో ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి గురువారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఓదార్చి అండగా ఉంటామని మృతుల కుటుంబాలకు భరోసా ఇచ్చారు. కమలాపురానికి చెందిన శ్రీమన్నారాయణ, ఇదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు డీ.జే రాజేష్ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. నాగజ్యోతి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజుయాదవ్, గోవిందరావుపేట మాజీ జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఏటూరు నాగారం మాజీ ఎంపీపీ కోసేరు నగేష్, జిల్లా సీనీయర్ నాయకుడు జగదీష్, మంగపేట సహకార సంఘం డైరెక్టర్ సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావుగుప్తా, బీఆర్ఎస్ వివిద అనుబంధ సంఘాల బాధ్యులు గుడివాడ శ్రీహరి, గోస్కుల లక్ష్మి, సుధాకర్, తిరుపతి, బుట్టోతో పాటు బీఆర్ఎస్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నూరి మల్లయ్య ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. దీంతో ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి హాజరయ్యారు. ఆమె మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, సప్పిడి రాం నర్సయ్య, రామన్నగూడెం మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ, మాదరి రామయ్య, గద్దల శ్రీరాములు, కారం పోషాలు ఉన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల పరిధిలో పోలీసులు ప్రతీ రోజు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్సైలు పవన్ కుమార్, శశాంక్ ఆధ్వర్యంలో మహదేవపూర్‌లోని బొమ్మాపూర్ క్రాస్, చౌరస్తా, రాపల్లికోట క్రాస్, సూరారం, మేడిగడ్డ బ్యారేజీ వంటి ప్రధాన అడ్డాల వద్ద నిఘా పెంచుతున్నారు. యువత గంజాయికి బానిసలవుతుండటంతో అడ్డుకట్ట వేసేందుకు రాత్రివేళల్లోనూ గస్తీ తిరుగుతున్నారు. ప్రతీ రోజు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండడంతో వాహనదారులు సైతం తాగి నడిపేందుకు జంకుతున్నారు. తనిఖీల్లో లైసెన్సులు, వాహన పత్రాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల, ఇంతకు ముందున్న పాత చలాన్లను రాబడు తున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

మల్హర్(టౌన్), సెప్టెంబరు 18(ఆంధ్ర జ్యోతి): జేడి మల్లంపల్లి మండలంలోని 10 గ్రామపంచాయతీలలో పారిశుధ్య పనులు చేప ట్టాలని బీఆర్ఎస్ మ ండల యువజన విభాగం అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ యువజన నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణకు ప్రతిష్టాత్మకమైన బతుకమ్మ పండగ దగ్గరికి వస్తున్న క్రమంలో మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం చేపట్టాలని, బ్లీచింగ్ చల్లించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పండగకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని, కోరారు. పలు అంశాలపై చర్చించారు. యువజన విభాగం నాయకులు కుక్క ల సంపత్, కట్ల గణపతి, మాజీ వార్డ్ మెంబర్ బొమ్మకంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల సూర్యుల ప్రాణాలు.. గాల్లో దీపాలు

(5వ పేజీ తరువాయి)

ఆఫీసర్ మురళీ మోహన్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ పాటు సింగరేణి రెస్క్యూ, సేఫ్టీ, ఫైర్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని గనిలో చెలరేగుతున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రెండు గంటల తరువాత కూడా మంటలు ఆరిపోకపోవడంతో రెండో షిఫ్టులో కార్మికులను లోనికి అనుమతించలేదు. రాత్రి 8 గంటల వరకు కూడా గనిలో మంటలు వ్యాప్తి తగ్గలేదని, ఇంకా సుమారు 5 గంటలు ఆర్పే ప్రయత్నం చేస్తే గానీ ఆగే పరిస్థితి లేదని ఫైర్ అధికారలు చెప్పారు.

- తప్పిన పెను ప్రమాదం..

కేటీకే 5 ఇంక్లైన్ గనిలోని రెండో లెవల్ మ్యాన్‌రైడింగ్‌లోకి మొదటి షిఫ్ట కార్మికులు విధులకు హాజరయ్యారు. ఉదయం 7:15 గనిలోకి దిగగా మధ్యాహ్నం సమయంలో 12 గంటల నుంచే పొగ చూరడాన్ని కార్మికులు గమనించి అధికారులకు సమాచారం ఇవ్వగా అధికారులు పెద్దగా పట్టించుకోలేదని పలువురు కార్మికులు ఆరోపించారు. తదుపరి వీరి విధుల ముంగిపు మధ్యాహ్నం 2:20 తరువాత పొగ అధికమై మంటలు చెలరేగాయని కార్మికులు చెప్పుకొచ్చారు. దీంతో తేరుకున్న అధికారులు అప్రమత్తమయ్యారన్నారు. గనిలోనే ఇంకా నలుగురు ఉన్నట్లు గుర్తించగా ముగ్గురు ముందుగా బయటకు వచ్చి అస్వస్థతకు గురయ్యారు. ఇంకా ఒకరు గనిలోనే ఇరుక్కుపోగా ఆ కార్మికుడి పరిస్థితి ఏంటోననే అయోమయ పరిస్థితి ఏర్పడింది. సుమారు అరగంట పాటు అధికారులు రక్షణ చర్యలు చేపట్టి కార్మికుడిని బయటకు తీసుకరాగా ఆయన పరిస్థితి నిలకడగానే ఉండటంతో అటు అధికారులు, ఇటు కార్మికుల కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. మరోవైపు గని లోపల నేరుగా వెల్డింగ్ చేసే పని చేయవద్దని, ఒక వేళా చేస్తే అందుబాటులో రక్షణ పరికరాలు ఉంచుకోవాలనే నిబంధన ఉన్నా గని అధికారులు ఈ విషయంలో పట్టించుకోలేదనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. మొత్తంగా గనిలో తలెత్తిన ఈ ప్రమాదం ఏరియాలోని అన్ని గనుల కార్మికులు, అధికారులను ఒకింత కుదిపేసిందనే చెప్పుకోవచ్చు. ఈ ఘటన ఏరియా వ్యాప్తంగా సర్వత్రా చర్చనీయాంశమైంది.

అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది

డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):అన్ని దానాల కన్నా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను నిలబెట్టే రక్తదానం మహత్తరమైందని బీజేపీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కాటారం డివిజన్ కేంద్రంలో సేవా పక్వాడా అభియాన్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో చల్ల నారాయణరెడ్డి గృహంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చేపట్టిన రక్తదాన శిబిరంలో 5మండలాల పరిధిలోని బీజేపీ నాయకులు, అభిమానులు 101మంది రక్తదానం చేశారు. పెద్ద సంఖ్యలో రక్తదాతలు రావడంతో బీజేపీ నేతలకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సునీల్‌రెడ్డి, నారాయణరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సేవా పక్వాడా అసెంబ్లీ కన్వీనర్ బొమ్మన భాస్కర్‌రెడ్డి, బీజేపీ కాటారం, మహాముత్తారం, మల్హర్, మహదేవపూర్ మండలా ల పాగె రంజిత్‌కుమార్, పూర్ణచందర్, బండ శ్రీకాంత్, రాంశెట్టి మనోజ్, జిల్లా, మండల నాయకులు మహ్మద్ రఫీ, పిల్లలమర్రి సంపత్, బండం మల్లారెడ్డి, గీట్ల శ్రీనివాస్‌రెడ్డి, కల్వచర్ల రాజు, తిరుపతి, గోగుల రాజేష్, మంత్రి సునీల్, బండి రమేష్, వీరారెడ్డి, బొంతల రవి, శ్రీశైలం ఉన్నారు.



శిబిరంలో బీజేపీ రాష్ట్ర నేతలు సునీల్‌రెడ్డి, నారాయణరెడ్డి

●ములుగు కలెక్టరేట్ : భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఎస్టీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూప ఆధ్వర్యంలో గురువారం ములుగులోని సాధన పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు భూక్య జవహర్‌లాల్, కొత్త సురేందర్, సూర్యదేవర విశ్వనాథ్, ఇమ్మడి రాకేష్, రాయంచు నాగరాజు, లక్ష్మి, సుమలత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ఐ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకులం క్రీడా మైదానంలో నేడు(శుక్రవారం)ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి(కాటారం, మల్హర్ మండలాల పరిధి)క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆమె మాట్లాడుతూ మండలాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన బాల, బాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో అండర్-14, 17విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9 గంటలకు క్రీడా మైదానానికి రావాలని తెలిపారు. ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ రాధ, పీడీలు, పీఈటీలు మహేందర్, రమేష్, మాజీనా, వెంకటేష్, గౌతమి, వీరన్న, శ్రీధర్, కార్తీక్, రాజేశ్వరి తదితరులున్నారు.

సొంతఖర్చులతో వీధి దీపాల ఏర్పాటు

కాటారం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుమ్మళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ, దసరా వేడుకలను పురస్కరించుకుని తాజా మాజీ సర్పంచ్ కంకణాల లతాబక్కిరెడ్డి సొంత ఖర్చులతో వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఎల్ఈడీ బల్బులు, విద్యుత్ తీగతో పాటు ఇతర సామాగ్రిని కొనుగోలు చేసి జీపీ కార్యదర్శి ప్రవీణ్‌కు మాజీ సర్పంచ్ కుమారుడు రఘునందన్ గురువారం అందజేశారు.

ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా రాజేందర్



బాధ్యతలు తీసుకున్న రాజేందర్

చిట్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా క్రాంతి పథకం మండల ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా మండల కేంద్రానికి చెందిన గుర్రం రాజేందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. టేకుమట్ల మండలంలో సీసీగా బాధ్యతలు నిర్వర్తించిన రాజేందర్ ఇటీవల బదిలీపై చిట్యాలకు వచ్చారు. ఈ క్రమంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన ఏపీఎం మంజుల టేకుమట్లకు బదిలీ కాగా చిట్యాల ఇన్‌చార్జి బాధ్యతలు రాజేందర్‌కు అప్పగిస్తూ జిల్లా సెర్ప్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఫర్టిలైజర్ షాపు యాజమాని మృతి



కృష్ణ (ఫైల్)

చిట్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన పావని ఫర్టిలైజర్ షాపు యాజమాని పెరుమాండ్ల కృష్ణ (36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 16న సొంత పని నిమిత్తం చౌరస్తాకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవే టు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా కృష్ణ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోల్కొండ సురేష్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాలలో నాణ్యమైన భోజనం అందకపోవడంతో విద్యార్థులు తరచుగా అస్వస్థతకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు వంశీ, సాయి, ప్రశాంత్ ఉన్నారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

వెంకటాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి క్రాంతికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న పిల్లల వైద్యనిపుణులచే పిల్లలకు, 22న ఛాతి వైద్యనిపుణులు, 23న స్త్రీల వైద్య నిపుణులు, 26న దంత వైద్య నిపుణులచే వైద్యశిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం

తాడ్వాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తాడ్వాయి, కాటాపూర్, కొడిశాల ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రణధీర్ ప్రకటనలో తెలిపారు. అయితే మహిళల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. అందుకు గాను మండ లంలోని మూడు ఆరోగ్య కేందాలలో ఈ శిబిరాలను ఈ తేదీలలో తాడ్వాయి 19న, కాటాపూర్, కొడిశాలలో 20 తేదీలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిల్లల, స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు రానున్నరని తెలియజేశారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన

తాడ్వాయి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెపల్లి గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో టీజీఐఎల్‌పీ తెలంగాణ ఇన్‌క్లూసివ్ లవ్లీహుడ్ ప్రోగ్రాం నిర్వహించారు. పెరటి కోళ్ల పెంపకానికి ఆసక్తిగా ఉన్న లబ్ధిదారులకు పెంపకంలో మెళకువలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోళ్లకు అందించాల్సిన దాణా విషయాలు తెలిపారు. కోళ్ల వ్యాధి నివారణకు వేయవలిసిన టీకాలు వ్యాక్సిన్‌ల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ టీజీఐఎల్‌పీ జీవనోపాధుల విభాగం అధికారులు భవ్య లోకేష్, వాసన్ ఎన్‌జీవో నుంచి లక్ష్మణ్, నర్సింహులు, డీఆర్‌డీఏ నుంచి డీపీఎం ఫామ్ రాజు, టీజీఐఎల్‌పీ జిల్లా కోఆర్డినేటర్ వెంకన్న ఏపీఎం కిషన్, సీసీ భద్రయ్య, సిబ్బంది యాదగిరి, శ్రీకాంత్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

జీతాలు రాక మల్టీపర్పస్ వర్కర్ల ఇబ్బందులు

మల్హర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా జీతాలు రాక మల్టీపర్పస్ వర్కర్లు (జీపీ కార్మికులు) ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 15 జీపీలు ఉండగా 59 మంది మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నారు. జీతాలు రాకపోతే పండుగ పూట పస్తులు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జీపీ ఖాతలో వీరి జీతాలు జమ చేసిన తర్వాత డబ్బులు డ్రా చేసి కార్యదర్శులు వీరికి జీతాలు ఇచ్చేవారు. కాని రాష్ట్ర ప్రభుత్వం నుంచి గత రెండు నెలలుగా డబ్బులు జమ చేయకపోవడంతో జీతాలు రాక మల్టీపర్పస్ వర్కర్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతా లు విడుదల చేసి ఆదుకోవాలని మల్టీపర్పస్ వర్కర్లు కోరుతున్నారు.

వన భోజనాలకు మహాముత్తారం గ్రామస్థులు

మహాముత్తారం, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మహాముత్తారం గ్రామస్థులు గురువారం వన భోజనాలకు వెళ్లారు. మూడు రోజులుగా వర్షం లేకపోవడంతో గ్రామంలోని రైతులు కుటుంబంతో కలసి సమీపంలోని అడవికి వెళ్లి అక్కడే వంటలు చేసుకొని బంధుమిత్రులతో కలసి భోజనాలు చేశారు. తదనంతరం మహిళలు బతుకమ్మ ఆడుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పురుషులు కోలాటం, కబడ్డి వంటి ఆటలతో సంతోషంగా గడిపారు. ప్రకృతి ఇచ్చే ఆహ్లాదం మరేది ఇవ్వలేని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. వర్షం కురువాలని వరుణదేవుడికి పూజలు చేశారు. నైవేద్యాలు పెట్టారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : జయశంకర్

Jayashankar Aco - 9985426984,

Bhupalpally SR - 8008795764

Mulugu SR - 9849245045, Eturunagaram

SR - 7673960447 ACM - 9985411664